ప్రజాశక్తి
శనివారం 1 జూలై 2023
I
అల్లూరి సీతారామరాజు

3న చలో విజయవాడ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సర్పంచ్ ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఈనెల 3న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల సర్పంచులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కే.హరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిధులు లేక పోవడంతో గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడిపోయిందని విమర్శించారు. నిధులు లేక క్లాప్ మిత్రులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందని, సర్పంచ్ లకు ప్రభుత్వం చెల్లించే గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి.సునీత, పి.కొములు, జి శారద, సుబ్బారావు, బి.లచ్చు, అర్జున్, కమల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ఉందాం.. ప్రభుత్వ మెడలు వంచుదాం

'పోలవరం పోరుకేక'లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడిన నేతలు

భారీ జన సమూహంతో సాగుతున్న పాదయాత్ర, అభివాదం చేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాజకీయ పార్టీలతో పాటు అంతా కలిసికట్టుగా పనిచేసే ప్రభుత్వ మెడలు వంచుదామంటూ సిపిఎం, టిడిపి, జనసేన, కాంగ్రెస్ నాయకులతోపాటు ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జూన్ 20న ఏటపాక మండలం నెల్లిపాకలో ప్రారంభమైన పోలవరం పోరుకేక పాదయాత్ర 11వ రోజు శుక్రవారం బుట్టాయగూడెం నుంచి ప్రారంభమై మర్లగూడెం, ఏజెన్సీ ముఖద్వారం జంగారెడ్డిగూడెం మీదుగా గుర్వాయిగూడెం వరకు సాగింది. ఈ పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మర్లగూడెం కొత్తకాలనీ వాసులు హారతులిచ్చి పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెం పోలీసెట్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెంలోని చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ప్రసాద్ కుటుంబ సమేతంగా విచ్చేసి పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. డివైఎఫ్ఐ బృందం, స్థానిక సిపిఎం నాయకులు ఘనస్వాగతం పలికారు. బైపాస్ రోడ్డు వద్ద మార్కెట్ యార్డులో భోజన విరామ అనంతరం జంగారెడ్డిగూడెం జెపి సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పాదయాత్ర బృందం తరలివెళ్లింది. ఈ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధరావు, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా, సిపిఎం రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, ఎవి.నాగేశ్వరరావు, కె.దళక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేతలు కిరణ్, తెల్లం రామకృష్ణ, మీడియం నాగమణి, డివైఎఫ్ఐ ప్రసాద్, ఆర్.లింగరాజు, వాణిశ్రీ, రాంబాబు, విఆర్‌పురం ఎంపిపి కారం లక్ష్మి, కుంజా రాధ, మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పార్టీలన్నీ నిర్వాసితుల సమస్యలపై పోరాడాలన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై నాయకులంతా మండిపడ్డారు. ఇది జాతీయ సమస్య అని, బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్య పరిష్కారమయ్యే వరకూ అంతా కలిసికట్టుగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సభ అనంతరం పాదయాత్రలో నిర్వాసితుల నుంచి వచ్చిన సమస్యలు కాలనీల్లో పరిస్థితులపై నాయకులంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

గఫూర్ కాలికి గాయం..

పోలవరం పోరుకేక మహా పాదయాత్రలో పాల్గొన్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ కాలికి గాయమైంది. బుట్టాయగూడెం నుండి ప్రారంభమైన యాత్రలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. పాదయాత్రలో నడుస్తున్న క్రమంలో రోడ్డుపై ఉన్న గోతుల్లో ఆయన అదుపు తప్పి పడిపోయారు. మోకాలుకు గాయం కావడంతో కార్యకర్తలు హుటాహుటిన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. డాక్టర్ వజ్రకిరణ్ గఫూర్‌కు వైద్య సేవలందించారు.

అలరించిన రేలారే రేలా

పట్నంలో ప్రజానాట్య మండలి కళాకారులు, గిరిజన యువత ప్రదర్శించిన రేలారే రేలా నృత్యం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం పట్టణానికి పోలవరం పోరుకేక పాదయాత్ర చేరుకుంది. ఈ నేపథ్యంలో పట్టణంలో జెపి సెంటర్ వద్ద రేలారేలా నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు, పలువురు నిర్వాసితులు ఈ నృత్యంలో పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు వారితో జత కలిశారు.

రేలారే రేలా నృత్యం చేస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

పాదయాత్రలో ఎంపిపి దంపతులు

పిల్లలను బంధువుల ఇంట వదిలి పోరుకేకలో భాగస్వామ్యం

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జూన్ 20 నుండి జులై 4వ తేదీ వరకు నిర్వహిస్తున్న పోరుకేక మహాపాదయాత్రలో తొలి రోజు నుండి తుది వరకు ఆ పార్టీకి చెందిన విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, సుందరయ్య దంపతులిద్దరూ పాల్గొంటున్నారు. తమ ఇద్దరు చిన్నపిల్లలను బందువుల ఇంట్లో ఉంచి 15 రోజుల పాటు వారు ఈ పాదయాత్రలో భాగస్వాములయ్యారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై సిపిఎంలో పని చేస్తున్న వారు పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే మండల స్థాయిలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మండల పరిషత్తు సమావేశాల్లోనూ ఎంపిపిగా లక్ష్మి నిర్వాసితుల సమస్యలను లేవనెత్తి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. నిర్వాసితులకు అడుగడుగునా అండగా ఉంటున్నారు. వారికి ఏకష్టమొచ్చినా మేమున్నామంటూ నిలబడుతున్నారు. ఇప్పుడు నిర్వాసితుల సమస్యను రాష్ట్రంలో ఏజెండాగా చేసేందుకు చేపట్టిన ఈ పాదయాత్రలోనూ వారు భాగస్వాములై నిర్వాసితుల పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. పాదయాత్రలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని ఎంపిపి దంపతులిద్దరూ తెలిపారు.

పాదయాత్రలో పాల్గొన్న ఎంపిపి దంపతులు కారం లక్ష్మి, సుందరయ్య

మాట్లాడుతున్న సూర్యనారాయణ

కిల్లోగుడ వసతి గృహంలో
విద్యుత్ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని పాఠశాల విద్యా కమిటి చైర్మన్ టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సుమారు 300 మంది గిరిజన విద్యార్థులు వసతి గృహంలో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వసతి గృహంలో విద్యుత్ సదుపాయం లేక విద్యార్థులు అంధకారంలో గడుపుతూ భయాందోళనతో గడపాల్సిన పరిస్థితి నెలకొందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడి ఎ పిఒ, డిడి స్పందించి కిల్లోగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

ప్లకార్డులు చూపుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

చదువు పేరుతో ఒత్తిడి సరికాదు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చదువు పేరుతో మానసికమైన ఒత్తిడికి గురి చేయరాదని, దీంతో వారి మనుగడకు ముప్పు కలిగే పరిస్థితి ఉంటుందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అల్లూరి జిల్లా అధ్యక్షుడు కే ప్రభుదాస్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత జూన్ నెల 12న పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వం ప్రారంభించిన తర్వాత అప్పుడే విద్యార్థులపై పరీక్షల పేరుతో గురుకుల కళాశాలలో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఈ కారణంగానే అరకువ్యాలీ గురుకుల కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్యకు సిద్ధమైందని చెప్పారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా సమగ్ర విచారణ జరిపించి, భాద్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు కోరారు. విద్యార్థులు భయాందోళనలకు గురి కాకుండా కౌన్సిలింగ్ ఇప్పించాలని కోరారు..ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. వర్షా కాలంలో విద్యార్థులకు సీజన్లు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, వసతి గృహలు, కళాశాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చిన్నారావు, ధనలక్ష్మి, పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్య

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు ఏపీ గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సీలేరు పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక విద్యార్థి అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ తదితరు వ్యాధులు బారిన పడకుండా దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం, ఇతర వ్యాధులు వస్తే వెంటనే స్థానిక పిహెచ్‌సికి రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్లే గ్రౌండ్లో పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ గ్రౌండ్‌లో ప్రతిరోజు వ్యాయామం, క్రీడలు పోలీసులు చేపడుతుంటారు. ఇటీవల వర్షాలకు గ్రౌండ్లో పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగాయి. వాటి వల్ల క్రీడలకు, వ్యాయామానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో సిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని జీడిగుప్ప పంచాయితీ పరిధి రాయిగూడెం గ్రామంలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, జీడిగుప్ప పంచాయితీ సర్పంచ్ ముట్ల బాలరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల పట్ల ఎక్కువగా మక్కువ చూపాలని, క్రీడల ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంజా రమేష్, కదల కొండారెడ్డి, పెడపెట్ల పవన్ కళ్యాణ్, క్రీడాకారులు, టోర్నమెంట్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సాయికృష్ణ, బాలరాజు

సాగు భూములు మాన్సాస్ ట్రస్ట్‌కు ఇచ్చేది లేదు

-జెడ్‌పిటిసి గంగరాజు, ఎంపిపి నీలవేణి
- ప్రజాభిప్రాయ సేకరణ సభలో గిరిజన రైతుల తీర్మానం
అధికారులూ..గోబ్యాగ్ అంటూ నినాదాలు

ప్రజాశక్తి -అనంతగిరి: 1/70 చటం, పీసా వంటి గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి తాత ముతాత కాలం నుండి సాగులో ఉన్న భూములు లాక్కోనేందుకు ప్రయత్నాలు చేస్తే ఊరుకునేంది లేదని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, స్థానిక ఎంపీపీ శెట్టి .నీలవేణిలు డిమాండ్ చేశారు. విజయనగరం మానస ట్రస్ట్ పివిటి రాజు, సిబ్బందిలు ప్రయత్నం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో చూస్తూ ఊరుకునేది లేదని ఇక్కడ నుండి వెనక్కు వెళ్లిపోవాలని తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ప్రారంభమైన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయంకు

భారీ ర్యాలీగా వెళుతున్న ప్రజాప్రతినిధులు, గిరిజనులు

చేరింది. భూముల జోలికి వస్తే తరిమి కొడతాం.. గో బ్యాక్ విజయనగరం మనసా ట్రస్టు పివిటి రాజులు అంటూ వ్యతిరేకంగా నినాదాలు చేసి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహశీల్దార్ రాంభాయి ఆద్వర్యన స్థానిక వెలుగు కార్యక్రమంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో రైతులు, ప్రజాప్రతినిధులు వ్యతిరేకంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఉద్దేశించి జెడ్పిటిసి, ఎంపీపీలు మాట్లాడుతూ, విజయనగరం జమీందారుల పరిపాలన కాలంలోని భూముల్లో సాగులో ఉన్నట్లు అప్పటినుండి ఇప్పటివరకు రెవెన్యూ రికార్డులలో నమోదు కాలేదని, 50. ఏళ్ల తర్వాత తమకు సంబంధించిన భూములు ఉన్నాయని హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఇందుకు రహస్యంగా సర్వేలు నిర్వహించి భూములు లాకున్నేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కొండిభ పంచాయతీ డమ్ముకు, మూవ్వంవలస, టోకురు పంచాయతీ బి.కంభవలస, రాయివలస, అనంతగిరి పంచాయతీ అనంతగిరి, ముండిజమ్మగుడ, ఎగువశోభ పంచాయతీ కొత్తవలస, హెక్టగుడ పంచాయతీ పరిధి ఎనిమిది గ్రాముల సాగు రైతులతో గిరిజన సాంప్రదాయ ఆయుధాలతో తిరుగుబాటుకు రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని, తక్షణమే వెనక్కు వెళ్లి పోవాలని వారు హెచ్చరించారు. రాజులు హైకోర్టుకు ఆశ్రయించినప్పుడు రైతుల పక్షాన డివిజనల్ రెవెన్యూ అధికారులు ఎందుకు హైకోర్టులో కౌంటర్ ఫైల్ దాఖలు చేయలేదని వారు ప్రశ్నించారు. గత మూడు నెలల క్రితం రహస్యంగా సర్వేలు నిర్వహిస్తుండగా నిలదీసి వెనక్కు పంపించడం జరిగిందని ఆ విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. పంచాయతీల సర్పంచులు కిల్లో మొస్య, సోమ్మెల రూతూ, పి.పున్నమ్మ, కె.సింహద్రి, ఎంపీటీసీ సారా. రత్నకుమారిలు మాట్లాడుతూ, నాలుగు పంచాయతీల పరిధిలోని 200 మంది రైతులు 318.26 ఎకరాల భూమిలో సాగులో ఉన్నారని, పూర్వకాలం నుండి సాగులో ఉంటూ వ్యవసాయ పంటలు, కాఫీ, మిరియాలు వంటి అంతర్జాతీయ పంటలు పండిస్తూ జీవనధారం సాగిస్తున్నారని తెలిపారు. ఈ భూములతో సంబంధం లేని గిరిజనేతురులు

ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

వీటి జోలికి వస్తే తరిమి కొడతామన్నారు. ఇప్పటికే కొంతమంది సాగు రైతులకు జిరాయితి, డిఫారం పట్టాలు రెవిన్యూ అధికారులు మంజూరు చేశారని, మిగతా వారికి కూడా పట్టాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

తహసిల్దార్ రాంబాయి మాట్లాడుతూ విజయనగరం మనసా ట్రస్టు రాజులు 2022లో హైకోర్టులో ఆశ్రయించగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ పాడేరు పిఓ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి ప్రజాప్రతినిధులు, రైతుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం నివేదికను అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు జె. సుబ్బారావు, మాజీ సర్పంచ్ సార దొన్ను, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఆర్ఐ లక్ష్మీకాంత్, మల్లన్న, సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో గిరిజనులకు మెరుగైన సేవలు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ - నేటి నుంచి ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 1వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ తహసిల్దార్లను, ఎంపిడిఓలను, మండల ప్రత్యేకాధికా రులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించవచ్చని, దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ముందుగానే వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల అవసరాలు గుర్తించి సచివాలయాల ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు జారీకి చర్యలు తీసుకుంటారని తెలిపారు. తహసిల్దార్, ఎంపిడిఓల ఆద్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి సచివాలయ ఫరిధిలో శిభిరాలు నిర్వహించి అవసరమైన ధృవ పత్రాలు జారీ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కలక్టర్ సూచించారు. శిభిరాల వివరాలు ముందుగానే ఆయా గ్రామాల ఫరిధిలో ప్రచారం చేయటంతో పాటు, ప్రజాప్రతినిధులను ఆహ్వానిం చాలని, వారి సలహాలు, సూచనలు తీసుకో వాలని ఆదేశించారు. గ్రామాలలో ప్రజల అవసరాలను గుర్తించి టోకెన్ జనరేట్ చేయాలని, అందుకు అనుగుణంగా సంబందిత డాక్యుమెంట్లతో సచివాలయంలో ఆన్ లైన్ చేసి వెంటనే వెరిఫికేషన్ చేయాలన్నారు.అవసరమైన కంప్యూటర్, లేప్ టాప్, స్కేనర్, ప్రింటర్ ధృవపత్రాల జారీకి అవసరమైన హై సెక్యూర్డ్ పేపర్, తదితరాలను సిద్ధం చేసుకోవాలని, వీలైనన్ని ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యవంతంగా సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ఆదార్, బ్యాంకు ఖాతా లింకేజ్ కు సంబంధించి కౌంటర్ ఏర్పాటు చేసి బ్యాంకర్లను ఆహ్వానించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు, సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, మండల ప్రత్యేకాదికారులు వి. మురళి, కొండలరావు, వి.ఎస్.కుమార్, పి.గోవింద రాజులు, ఎన్. సూర్యలక్ష్మి, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అధికారులపై సభ్యుల ఆగ్రహం

డుంబ్రిగుడ మండల సర్వసభ్య సమావేశం

సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : గత సమావేశంలో చర్చ జరిగిన సమస్యలను పరిష్కరించకపోవడంతో పాటు శాఖల సంబంధించిన పూర్తి సమాచారం లేకుండా సభకు హాజరై సభ్యులు అడిగిన సమస్యలపై స్పష్టమైన సమాధానం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఎంపిటిసి సభ్యులు కే.పాకారావు, దేవా, సర్పంచ్ పి.కొములు, సర్పంచులు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ బి.ఈశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో ఫిర్యాదు చేసిన సమస్యలను ఎన్ని పరిష్కరించారు! ఎన్ని పరిష్కరించ లేదు! అనే దానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సభ్యులు అధికారులను పట్టుబట్టారు. శాఖల వారీగా పూర్తి సమాచారం లేకుండా, గతంలో ఫిర్యాదు చేసిన సమస్యలపై కూడా స్పష్టత లేకుండా హాజరైన ఎందుకు ఉపయోగం ఉండదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో ఇది మండల సర్వసభ్య సమావేశమేనా అంటూ అధికారులపై తీవ్రంగా సభ్యులు మండిపడ్డారు. ఈ సమావేశానికి ఐసిడిఎస్ సిడిపిఓ హాజరు కాకుండా సూపర్వైజర్లు హాజరయ్యారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయిలో వారి వద్ద సమాచారం లేకపోవడంతో సభ్యులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సీట్ల సంఖ్యని పెంచాలని, అన్ని ఆశ్రమ పాఠశాలలు పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల భవనాలను పూర్తిగా నిర్మించి, ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా ఎంఈఓ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేయాలని కంద్రం, కొర్రాయి సర్పంచులు కే.హరి, పి.కొములు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఐటిడిఎ ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్న మొక్కలను ఆగస్టు లోపు అందజేయాలని గుంట పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత కోరారు.రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ ఏహెచ్ఏలు సక్రమంగా సమయ పాలన పాటించి విధులు నిర్వర్తించే విధంగా పశు వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సభ్యులు చెప్పారు. ఈ వైస్ ఎంపీపీలు ఎస్.ఆనంద్, పి.లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసిల్దార్ నాగమ్మ, వైద్యాధికారి పి.రాంబాబు, ఎంఈఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

పనిచేయని కుళాయిని పరిశీలిస్తున్న లక్ష్మణరావు.

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని మెరకచింత పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణరావు కోరారు. మెరకచింత గ్రామ ప్రజల తో కలిసి తాగునీటి పైప్ లైన్ ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ, గ్రామంలో తాగునీటి పైప్ లైన్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. పైప్ లైన్ మరమ్మతుకు గురై 6 నెలలు కావస్తుందని వాపోయారు. ఈ కార్యక్రమంలో మెరకచింత వార్డ్ మెంబర్ బాకూరు తౌడమ్మ, బాకూరు నాగరాజు, రామకృష్ణ, వెంకట రమణ రాజు, పూజారి దేవరాజు, బాకూరు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

త్వరితగతిన స్పందన సమస్యల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు

సమస్యలు తెలుసుకుంటున్న జెసి

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 130 అర్జీలు అందాయి. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐటిడిఏ ఏపీఓ ప్రభాకర్, డిఆర్ఓ పి.అంబేద్కర్‌తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించి ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు స్పష్టం చేసారు. ఈనెల 1వ తేదీ నుండి గ్రామ సచివాలయం పరిధిలో అధికారులు పర్యటించి లబ్దిదారులకు అవసరమైన ధృవ పత్రాలు జారీ చేయాలని సూచించారు. అనంతరం జి.మాడుగుల మండలానికి చెందిన 117 స్వయం సహాయక సంఘాలకు రూ. 13కోట్ల 37 లక్షల 45 వేల బ్యాంకు లింకేజీ చెక్కును పంపిణీ చేసారు. యూనియన్ బ్యాంకు మేనేజరును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వి. ఎస్. శర్మ, డి.ఆర్.డి.ఎ పి.డి వి. మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇ ఇ లీలా కృష్ణ, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు

పాడేరు మండలం దోకులూరు గ్రామంలో ఉన్న తాగునీటి పథకం మరమ్మతులు చేసి తాగునీటిని అందించాలని సర్పంచ్ కె. సన్నిబాబు వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం వంజరి గ్రామ పంచాయతీ సుద్ది గురువు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు వంతాల శ్రీను వినతిపత్రం అందజేశారు. డుంబ్రిగుడ మండలం కించుమండ గ్రామానికి చెందిన బి. చిన్నయ్య వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తును అందజేశారు.డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీలోని వంతర్ల, బలింగుండ, వెలిమెడ వలస, కాంలిలి వలస, రంగిని వలస, పాము రాయి గ్రామాలకు రోడ్లు నిర్మించాలని పి.ప్రసాద్, జి.రమణ తదితరులు వినతి పత్రం సమర్పించారు. అరకు వ్యాలీ మండలం చినలబుడు పంచాయతీ హట్టగుడ గ్రామం వద్ద 1960 సంవత్సరంలో నిర్మించిన ఆనకట్టు మరమ్మతులు చేపడితే 300 ఎకరాలకు సాగునీరు అందుతుందని సాంగి రఘునాథ్ కోరారు.

కొరియన్ భాష నేర్చుకుంటే ఉద్యోగాలు

మాట్లాడుతున్న కిమ్ హాంగ్‌జాయ్

ప్రజాశక్తి- సీతమ్మధార: కొరియన్ భాష నేర్చుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలాగే కియా కంపెనీలో అనేక మంది ఉద్యోగాలు సంపాదించారని కొరియాలోని సాంగొక్ యూనివర్సిటీ అంబాసిడర్ కిమ్ హాంగ్ జాయ్ స్పష్టం చేశారు. కొరియా భాష నేర్చుకునేందుకు విశాఖలోని ద్వారకానగర్‌లోని ఇన్సార్ భవనంలో జూలై 1నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని, మేయర్ గోలగాని హరి వెంకట కుమారి కోర్సును ప్రారంభిస్తారన్నారు.

శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ నైపుణ్యముంటే కొరియాలో అనేక ఉద్యోగాలు భారతీయుల కోసం ఎదురు చూస్తున్నాయని, ప్రధానంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది 10+2, పాలిటెక్నిక్, ఐటిఐ చదివి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నవారు, టెక్నికల్ స్కిల్స్ కలిగిన ఫిట్టర్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ విభాగాల్లో నైపుణ్యమున్న వారికి కొరియా భాషలో కనీస పరిజ్ఞానముంటే అక్కడ నెలకు కనీసం రూ. లక్ష వేతనం లభించే ఉద్యోగావకాశాలున్నాయన్నారు. కొరియన్‌లోని సాంగొక్ యూనివర్సిటీ అంబాసిడర్ కిమ్ హాంగ్ ప్రస్తుతం విశాఖ పర్యటనలో ఉన్నారన్నారు. భవిష్యత్తులో విశాఖ అంతర్జాతీయ నగరంవైపు భారీగా పెట్టుబడులు రాబోతున్న సందర్భంగా దక్షిణ కొరియాలోని పెట్టుబడిదారులు విశాఖ వైపు దష్టి సారిస్తున్నారన్నారు. ఆ భాషను రెండు నెలల్లో నేర్చుకునేలా సర్టిఫికెట్ కోర్సు విశాఖలో ప్రారంభం కానుందన్నారు.అనంతపురంలోని శ్రీకష్ణ దేవరాయ యూనివర్సిటీలో కొరియన్ క్లాసులు నిర్వహించి సుమారు 200మందికి పైగా నిరుద్యోగ యువతకు హిందూపూర్‌లోని కియా మోటార్స్ లో ఉపాధి కల్పించామన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఈ సంస్థకు సలహాదారుగా ఉన్నారని వెల్లడించారు. తెలుగు నుంచి కొరియా, ఇంగ్లిష్ టూ కొరియా భాష నేర్పడంలో అనంతపురం శ్రీకష్ణ దేవరాయ యూనివర్శిటీ లో సహాయ ప్రొఫెసర్‌గా అనుభవజ్ఞులైన డాక్టర్ ప్రశాంత్ స్వయంగా క్లాసులు నిర్వహిస్తారన్నారు. కొరియా నేర్చుకోవడానికి పెద్ద నగరాల్లో రూ.10 నుంచి 20వేల వరకు ఫీజులుం టాయని, ఇక్కడ మాత్రం కేవలం రూ.7వేలకే కనీస పరిజ్ఞానం వచ్చేలా చేస్తారన్నారు. ఆన్ లైన్, వారాంతపు కోర్సులు కూడా అందు బాటులో ఉంటాయని, ఆసక్తి ఉన్నవారంతా మరిన్ని వివరాలకు 8790279628 ఫోన్ నంబర్‌లో సంప్రదించ వచ్చున్నారు. కార్యక్రమంలో యాక్‌సాక్ కొరియన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి-పెదబయలు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కుష్ఠు వ్యాధిపై మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విశ్వేశ్వర్ నాయుడు మాట్లాడుతూ, కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు ప్రసాద రావు, డీపీఎంఓ రమ, వైద్యులు కిరణ్, కిషోర్ పాల్గొన్నారు

అర్హులకు సంక్షేమ లబ్ధి లక్ష్యం

ప్రజాశక్తి- సీతమ్మధార. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టారని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు, 25 వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ అన్నారు. వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె. రాజు ఆదేశాల మేరకు వార్డు పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లుతో సమీక్షించారు ఎపిడిఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యసేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఆరోగ్య సంరక్షణ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగు పడాలన్నారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, చిన్నారులకు, తల్లులకు పక్కాగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, జననీ సురక్ష పథకం ప్రయోజనాలు లబ్దిదారులకు సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. గర్భవతులు, బాలింతల గణాంకాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఐసిడిఎస్ అధికారుల వద్ద ఒకేలా ఉండాలని, వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ వేయకపోతే సంబంధిత ఎ.ఎన్. ఎంను సరెండర్ చేస్తామని హెచ్చరించారు. గత సంవత్సరం 24 వేల ప్రసవాలు జరిగితే 11 వేల మందికి మాత్రమే జననీ సురక్ష యోజన ప్రోత్సాహకాలు అందించారన్నారు.

ఎనిమిది వేల మందికి బ్యాంకు ఖాతాలు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందలేదని. చెప్పారు.గత రెండు నెలల్లో ఐదు వేల ప్రసవాలు జరిగితే 2500 మందికి పథకాలు వర్తింప చేశారని స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతాలు, ఆధార్ నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఆర్సిహెచ్ పోర్టల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. వైద్య సేవల్లో అలసత్వం ప్రదర్శిస్తే తీవ్రంగా పరిగణించి సంబంధిత వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిడిపిఓలు, వైద్యాధికారులు సిబ్బందితో నెలకు రెండు విడతలు సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు.

ఈ సమావేశంలో రంపచోడవరం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరి, ఐసిడిఏ న్ పథక సంచాలకులు ఎన్. సూర్యలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, పి.ఎం.యు, ప్రాజెక్టు అధికారి రాంగోపాల్, పాడేరు సిడిపిఓ ఝాన్సీ, పాడేరు, రంప చోడవరం డివిజన్ల సిడిపిఓలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో ఈనెల 3వ తేదీ నుండి జగనన్న సురక్ష శిభిరాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌర సంబందాల అధికారి పి. గోవింద రాజులు తెలిపారు. వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన ధృవపత్రాల వివరాలు సేకరించి, సచివాలయాలలో అందజేయాలన్నారు. ఈనెల 3న పెద లోచిలి, వంతలబీ 5న సొలభం -1, గడుతూరుబీ 7న గెమ్మెలి, వంజరి -1బీ 11న, పాల మామిడి, వంజరి-2బీ 13న కోరాపల్లి, పెదలువ్వసింగిబీ 15న జి.మాడుగుల-1, సింగర్భబీ 18న కె. కోడపల్లి, జి.మాడుగుల -2, 21న నుర్మతి, భీరంబీ 24న బొయితిలి, సొలభం -2 గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ప్రత్యేకాధికారి తెలిపారు.

పండ్ల మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన రైతులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో నాంది సంస్థ ప్రతినిధులు 10. రకాల పడ్లు మొక్కలను పంపిణీ చేశారు. అరకులోయ అట్టగుడ నాంది సంస్థ ప్రతినిధులు రైతులకు జామ, .బత్తాయి, మామిడి, కమల, సీతాఫలం వంటి మొక్కలను మండలంలోని టోకురు, పెద్దబిడ్డ, గుమ్మ పంచాయతీ గ్రామాలలో ఉచితంగా పంపిణీ చేపట్టారు.క్రమ పద్ధతి ప్రకారం మొక్కకు మొక్కకు ఏడు అడుగుల దూరం గోతులు తవ్వి నాటుకోవాలని ప్రతినిధులు సూచించారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

అదనపు విద్యుత్ ఛార్జీలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కొయ్యూరు : ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పేరుతో దోడ్డిదారిన విద్యుత్ వినియోగదారులపై పెద్ద ఎత్తున భారాలను వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం మండలంలోని కాకరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల రూపంలో మరో భారం వేసి ప్రజల నడ్డి విరిసిందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారాలు వేస్తున్నాయని తెలిపారు. అంబానీ అదాని లాంటి వారికి కరెంటు ఛార్జీలు రద్దు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారాలు మాత్రం మోయలేని భారాలు వేయడం దారుణమన్నారు. అదనపు విద్యుత్ ఛార్జీలను రద్దు చేయకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యుత్ సంస్కరణల పేరుతో ఛార్జీలు పెంచే విధానంపై ప్రజలకు తెలియజేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, నగేష్ పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పేరిట అన్యాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పేరుతో మత్యకారులను ఇబ్బంది పెట్టే విధంగా వ్యవహరిస్తూ పోర్ట్ అథారిటీ మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నా మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పందించకపోవడం శోచనీయమని మత్స్యకారుల సంఘం నాయకులు అన్నారు. వైశాఖి డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్, ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లోని యూనియన్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోటు బెర్త్ ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే బోటు లైసెన్స్‌ను రెన్యువల్ చేస్తామని విశాఖ పోర్టు అథారిటీ, మత్స్య శాఖ చెప్పడం అన్యాయమన్నారు. రొయ్యల రేట్లు గత ఏడాది రూ.500 ఉంటే, నేడు రూ.380 నుంచి రూ.350కే రొయ్యల కంపెనీలు కొనడం అన్యాయమని మండిపడ్డారు. మత్స్యకారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల తీవ్ర వివక్షకు గురవుతున్నారని వాపోయారు. బోటు బెర్త్ ఫీజు రూ.200 ఉండేదని, ఈ ప్రభుత్వం వచ్చాక ఒక బోటు బెర్త్ ఫీజు రూ.650కు పెంచిందని తెలిపారు. దీనికి జిఎస్‌టి, సర్వీసు ట్యాక్సు అదనమన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనుల విషయంపై కలెక్టర్ జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఓ, మత్స్యశాఖ అధికారులతో పలు పర్యాయాలు చర్చలు జరిపి అనేక హామీలు ఇచ్చారని, అందులో ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, వైశాఖి డాల్ఫిన్ బోట్ అవరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి వీర్రాజు, వైస్ ప్రెసిడెంట్ ధోని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సివిల్ కోడ్ రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తొందరపాటు పడుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ముస్లింల జెఎసి నేత డాక్టర్ ఎస్.రెహమాన్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉత్తరాంధ్ర ముస్లింల సంక్షేమ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెఎసి సభ్యులు షేక్ బాజ్జీ, ఇబ్రహీం, ఎండి షరీఫ్, హైదర్ అలీ సింకా, రహమతుల్ల బేగ్, ఎస్‌కె.సలీం వల్లి పాల్గొన్నారు.

మృత్యు కుహరాలుగా సెజ్ పరిశ్రమలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని సెజ్ పరిశ్రమలు మృత్యుకుహరాలుగా మారాయి. తరుచూ ఏదో ఒక పరిశ్రమలో, ఏదో ఒక కారణంతో ప్రమాదం చోటుచేసుకుంటోంది. ఈ ప్రమాదాల్లో కార్మికులు మృతిచెందడం, గాయాలపాలవ్వడం పరిపాటిగా వుంది. తాజాగా శుక్రవారం ఉదయం అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా యూనిట్-1లో రియాక్టర్ పేలిన ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా వుంది. అభిజిత్, సీడ్స్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల ఘటనలు మరువక ముందే సాహితీలో ఈ భారీ ప్రమాదం జరిగింది. ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు యాజమాన్యాలు తీసుకోని ఫలితంగా కార్మికులు బలవుతున్నారు. ప్రమాదం జరిగిన కంపెనీల్లో యాజమాన్య లోపాలు, నిర్లక్ష్యం కొట్టిచ్చినట్లు కనబడుతున్నా వారిపై కేసు పెట్టడంలేదు. మరోసారి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకొనేలా చర్యలు వుండడంలేదు. ఇటీవల పరవాడ ఫార్మాలోని లారస్ ల్యాబ్ మూడో యూనిట్, ఆరో బ్లాకులో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతిచెందారు. ఇక్కడ ఔషధ పౌడర్ శుద్ధికి ఉపయోగించే టోలిన్ లీకై స్థిర విద్యుత్ ఉత్పత్తి జరగడంతో వ్యాపించిన మంటల్లో కార్మికులు మరణించారు. పైపులైన్ నిర్వహణ సక్రమంగా లేదని ప్రమాదంపై పరిశ్రమల శాఖ అధికారులు నిర్వహించిన విచారణలో గుర్తించారు. అచ్యుతాపురం సెజ్‌లోని జిఎంఎఫ్‌సి ల్యాబ్‌లో రియాక్టర్ పేలిన ఘటనలో ఒకరు మృతిచెందారు. నలుగురు గాయపడ్డారు. హెచ్‌డిపిఇ పైప్‌లైన్ ద్వారా మిథనాల్‌ను రియాక్టర్‌లోకి పంపిస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. గతంలో నక్కపల్లి హెటిరో డ్రగ్స్‌లో రియాక్టర్ పేలి ఒకరు చనిపోగా, నలుగురు గాయపడ్డారు. ఫార్మాసిటీలోని సాయినార్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. స్మైల్ ఎక్స్ కంపెనీలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారు. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో సీడ్స్ కంపెనీలో 2022 జూన్ 3న, ఆగస్టు 2న విష వాయువులు లీకైన ఘటనలో 539 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఫార్మా, ఇతర కంపెనీల్లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంలో అవి అలానే కొనసాగుతున్నాయి. కార్మికుల భద్రత, రక్షణ చర్యలు తీసుకోవడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పరిశ్రమల శాఖ తనిఖీల్లో ఈ లోపాలు బయటపడుతున్నా సరిచేయలేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిచేయనంతకాలం ఈ ప్రమాదాలకు ముగింపు వుండేలాలేదు.

నిత్యం ప్రమాదాలు
కార్మికుల భద్రత పట్టని యాజమాన్యాలు

గోపవరంలో జగనన్న సురక్ష ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ పరిధి గోపవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సచివాలయం కన్వీనర్ పెట్ల గాంధీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, ముటేషన్, టైటిల్‌డీడ్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, కొత్త, స్ప్లిట్ రేషన్ కార్డ్స్ హౌస్ హోల్డ్ స్ప్లిట్ చేయుట తదితర 11 రకాల సేవలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చెసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అప్పన్నబాబు, దేవి పాల్గొన్నారు.

సర్వే చేపడుతున్న సిబ్బంది

మండలంలో జగనన్న సురక్ష సమీక్షల షెడ్యూల్ ఇదీ..

ప్రభుత్వం తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ లాలం సీతయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ సచివాలయాల వారీగా సమీక్షలు నిర్వహిస్తామని, దీనికి ముందు వారంరోజులు స్థానిక సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల అవసరాలను గుర్తించి వారికి టోకెన్ అందచేస్తారని తెలిపారు. ఆయా సచివాలయాలకు మండలాధికారుల టీమ్‌లు వచ్చినప్పుడు టోకెన్ పొందిన ప్రజలు అక్కడకువచ్చి సేవలు పొందాలని సూచించారు. ఇందులో కోసం మండలంలోని డిప్యూటీ తహశీల్దార్ కె.సీతారం, ఎంపిడిఓ లాలం సీతయ్య, ఆర్‌ఎస్‌ఐ టి.రాజన్నదొరతో టీమ్-1, తహశీల్దార్ సిహెచ్.తిరుమలరావు, ఇఓపిఆర్‌డి ఆర్‌పి.నాయుడు, ఎఓ ఉమాదేవితో టీమ్-2 ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ వివరించారు. ఈ టీమ్-1 అధికారులు జులై 7న ఆకుల, 10న బకులూరు, 12న బంగారం పేట, 14న బంగారం పేట-2, 26న బూదరాళ్ల, 24న సిడి.పాలెం, 3న చిట్టింపాడు, 1న డౌనూరు, 17న కంకారం, 19న కొమ్మిక, 21న కొండగోకిరి, 5న కొయ్యూరు గ్రామసచివాలయాల్లోనూ, టీమ్-2 అధికారులు 24న ఎం.భీమవరం, 12న ఎం.మాకవరం, 7న మర్రివాడ, 14న నడింపాలెం, 1న రావణాపల్లి, 3న రాజేంద్రపాలెం, 5న రేవళ్లు, 17న శరభన్నపాలెం1, 19న శరభన్నపాలెం-2, 21న యు.చీడిపాలెం గ్రామసచివాలయాల్లో పర్యటించి, సమీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ షెడ్యూలు ప్రకారం ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు.

విజయవంతం చేయండి

రాజవొమ్మంగి : పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో యాదగిరిశ్వరరావు ఆదేశించరు. మండలంలోని బడదనాంపల్లి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. జులై 1 నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సిబ్బంది సన్నద్ధం కావాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న పూనెం సత్యనారాయణ

మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- విఆర్.పురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై జులై 4న సిపిఎం ఆధ్వర్యాన విజయవాడలో జరిగే మహాధర్నాకు నిర్వాసితులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీ నుండి విజయవాడ వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా జులై 4న విజయవాడలో మహా ధర్నా జరుగుతుందని, దీనికి ఇంటికో మనిషి ఊరుకో వాహనంతో నిర్వాసితులు కదిలి రావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు తొడం రాజు, గుండెపూడి లక్ష్మణరావు, నాళ్లారపు ప్రకాశరావు, ఆత్మకూరి కాంతారావు, నాళ్ళారపు చంద్రావు, వార్డు మెంబర్ గొంది దారయ్య, మాజీ సర్పంచులు బూమమ్మ, పులి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక'కు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి సాగుతున్న పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కెవిపి.చంద్రమౌళి నేతృత్వాన కెజిహెచ్ సూపరింటెండెంట్ ఆఫీస్ వద్ద శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో, సోదరభావంతో మెలిగి విరాళాలు అందించడంతో పాటు పోలవరం నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అప్పలరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నరసింగరావు, యువజన సంఘం నాయకులు సంతోష్, హోటల్ కార్మిక సంఘం నాయకులు రామారావు, తదితరులు పాల్గొన్నారు. రూ.3700 విరాళంగా వచ్చింది.

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్ మదన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

అక్రమ కలప స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని రేవళ్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 22 రోజ్ వుడ్, గనరా దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని అటవీ శాఖ రేంజ్ అధికారి కె.జగదీష్ తెలిపారు. అక్రమంగా ఎవరు కలపను రవాణా చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కె.సింహాద్రి, కె.దుర్గాప్రసాద్, ఆర్.రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టు తులసి చందుకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 15 సంవత్సరాలుగా మీడియాలో పనిచేస్తూ ఎన్నో అవార్డులు పొందిన జర్నలిస్టు తులసి చందుపై బెదిరింపులు ఆపాలని, ఆమెకు రక్షణ కల్పించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆమెపై ఆర్‌ఎస్‌ఎస్, అల్లరి మూకలు చేస్తున్న ట్రోలింగ్ దాడులను ఖండించారు.